క్లుప్తంగా

నేడు ఆలయ వార్షికోత్సవం


కట్టమైసమ్మ

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణం లోని సురస ముద్రం కట్టపై వెల సిన కట్టమైసమ్మ దేవాలయ ప్రథమవార్షి కోత్సవాలను ఈ నెల 23న నిర్వహించనున్నారు. ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయ కమిటీ చైర్మన్ మక్తాల వెంకటయ్య ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని చైర్మన్ కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

కడ్తాల్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యామ రాజేశ్ అన్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో మండల పరిధి రేఖ్య తండాకు చెందిన నేనావత్ రమేశ్ నాయక్‌కు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.35 వేలు మంజూరు అయ్యాయి. ఈ మేరకు శుక్రవారం తండాలో బాధిత కుటుంబానికి చెక్కు అందజేశారు. శ్రీనునాయక్, కృష్ణనాయక్, పవన్, రాజు, వినోద్, నవీన్, గణేశ్, వీణ, వినోద్, నరేశ్ ఉన్నారు.

ఆర్గానిక్ హెల్త్ కిట్స్ పంపిణీ

ఆమనగల్లు: మండల పరిధి మేడిగడ్డతండాలో శుక్రవారం ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలువురికి ఆర్గానిక్ హెల్త్ కిట్స్ పంపిణీ చేశారు. తండాలో గతవారం ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మొబైల్ హెల్త్‌క్యాంపు నిర్వహించి, పలువురికి ఉచితంగా వైద్య పరీక్షలు, రక్త పరీక్షలు నిర్వహించారు. ప్రస్తుతం వారందరికీ కిట్స్‌ను ఐక్యత సభ్యులు మల్లేశ్ నాయక్, శ్రీను నాయక్‌లు అందజేశారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత


విరాళం అందజేస్తున్న దాత

కడ్తాల్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని, ప్రతి ఒక్కరూ భక్తిభావం పెంచుకోవాలని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోచమ్మ తల్లి ఆలయంలో అమ్మవారికి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులకు రూ.51,116ల విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సత్యం యాదవ్, సభ్యులు చేగూరి రాములు, యాదయ్యగౌడ్, రాంచందర్‌నాయక్, బోసు రవి, భానుకిరణ్, అశోక్, నాగార్జున ఉన్నారు.

ఫిరంగి నాలాపై కల్వర్టు నిర్మించాలి

ఇబ్రహీంపట్నం రూరల్: ఫిరంగి నాలాపై ధ్వంసమైన కల్వర్టును తొలగించి, కొత్తగా నిర్మించాలని సీపీఎం మండల కార్యదర్శి సీహెచ్ బుగ్గ రాములు డిమాండ్ చేశారు. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధి సాహేబ్‌గూడ గేటు సమీపంలోని ఫిరంగి నాలాపై శిథిలావస్థలో ఉన్న కల్వర్టును పునర్నిర్మించాలని కోరుతూ.. ఆ పార్టీ మున్సిపల్ కన్వీనర్ తులసిగారి నర్సింహ అధ్యక్షతన ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్షాల కారణంగా కల్వర్టు దెబ్బతిన్నదని పేర్కొన్నారు. గోతులు ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. పరిస్థితిని గమనించి, వెంటనే కల్వర్టు నిర్మాణం చేపట్టాలని కోరారు. సీపీఎం నాయకులు నర్సింహ, జగన్, పెంటయ్య, రంజిత్, కతాల్, బీఎస్పీ నాయకులు మహేందర్, దాసులు పాల్గొన్నారు.

డీజే నిర్వాహకులపై కేసు నమోదు

ఆమనగల్లు: అనుమతిలేకుండా గురువారం రాత్రి డీజేలు పెట్టిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేశామని తలకొండపల్లి ఎస్ఐ శ్రీకాంత్ శుక్రవారం తెలిపారు. పర్మిషన్ లేకుండా డీజే సిస్టమ్‌ను వినియోగించిన డీజే యజమాని చుక్కాపూర్‌కు చెందిన కడారి కుమార్, తలకొండపల్లి గ్రామానికి చెందిన మహేశ్, పడకల్ వాసి నవీన్‌లపై కేసు నమోదు చేసి, సౌండ్ బాక్స్‌లను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

ఉపాధితో గ్రామాలకు ఊతం

ఇబ్రహీంపట్నం రూరల్: ఉపాధిహామీ పనులు గ్రామాల అభివృద్ధికి ఊతమిచ్చాయని ఉప్పరిగూడ పంచాయతీ కార్యదర్శి సురేష్‌గౌడ్ అన్నారు. పనుల జాతరలో భాగంగా శుక్రవారం మండల పరిధి పోల్కంపల్లి, నాగన్‌పల్లి, పోచారం, తులేకలాన్ గ్రామాల్లో మొక్కలు నాటారు. ఎల్మినేడు, ఉప్పరిగూడలో పశువుల షెడ్లను ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యల్లో సహకార సంఘం!

- చైర్మన్ పీఠంపై పీటముడి
- తప్పుకొనేది లేదంటూ భీష్మించిన కొత్తపల్లి, చేగూరి
- ఖాతాదారులకు నగదు చెల్లింపుల్లో ఇబ్బంది
- బాటసింగారం భవిష్యత్తుపై ఆందోళన


బాటసింగారం రైతు సేవా సహకార సంఘం


భరత్‌కుమార్, చైర్మన్


జైపాల్‌రెడ్డి, ఇన్‌చార్జి చైర్మన్

అబ్దుల్లాపూర్‌మెట్: బాటసింగారం రైతు సేవా సహకార సంఘం సమస్యల ఊబిలో చిక్కుకొంది. ఏడాదిగా చోటుచేసుకుంటున్న పరిణామాలతో సంఘం భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లాభాల బాటలో దూసుకుపోతున్న సంఘానికి తాకిన రాజకీయ సెగతోనే పాలన గాడితప్పిందని రైతులు, ఖాతాదారులు ఆరోపిస్తున్నారు. కొంత కాలంగా సంఘం చైర్మన్ పీఠంపై చోటుచేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో పరిస్థితులు గందరగోళంగా మారాయని పేర్కొంటున్నారు. రుణం కోసం వచ్చే రైతులకు సకాలంలో రుణాలు ఇవ్వకపోవడంతో పాటు సంఘంలో డిపాజిట్ చేసిన ఖాతాదారుల.. అవసరాలకు డబ్బులు ఇవ్వడంలో ఇక్కడి సిబ్బంది విఫలమయ్యారనే విమర్శలు లేకపోలేదు.

పట్టువీడని మిత్రులు

గత పాలకవర్గంలో చైర్మన్‌గా కొనసాగిన లెక్కల విఠల్‌రెడ్డిపై అవిశ్వాసం పెట్టి ఆయనను గతేడాది ఫిబ్రవరిలో పదవి నుంచి తప్పించేందుకు పనిచేసిన ఇద్దరు మిత్రులు చేగూరి భరత్‌కుమార్, కొత్తపల్లి జైపాల్‌రెడ్డిలు.. ఇప్పుడు అదే పీఠాన్ని సొంతం చేసుకునేందుకు విశ్వ యత్నాలు చేస్తున్నారు. విఠల్‌రెడ్డిని పదవి నుంచి దించేసిన అనంతరం భరత్‌కుమార్‌ను ఎన్నుకున్న విషయం తెలిసిందే. అయితే ఇటీవల కొంతమంది మాజీ సర్పంచులు చైర్మన్ వ్యవహారంపై జిల్లా సహకార శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయనను తప్పిస్తూ.. ఇన్‌చార్జిగా జైపాల్‌రెడ్డి కొనసాగాలంటూ ఈ నెల 14న అధికార యంత్రాంగం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆగస్టు 15న కొత్తపల్లి బాధ్యతలు చేపట్టారు.

ఉత్తర్వుల రద్దుతో ముసలం

అనుకోకుండా చోటు చేసుకున్న పరిణామాలతో భరత్‌కుమార్.. హైకోర్టును ఆశ్రయించారు. తనను పదవి నుంచి తొలగిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను, జైపాల్‌రెడ్డిని ఇన్‌చార్జిగా కొనసాగిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోర్టును కోరారు. దీంతో న్యాయస్థానం వాటిని రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో ముసలం పురుడు పోసుకుంది. కోర్టు ఉత్తర్వులతో గురువారం సంఘం కార్యాలయానికి భరత్‌కుమార్ రాగా.. అప్పటికే చైర్మన్ చాంబర్‌కు ఇన్‌చార్జిగా కొనసాగుతున్న జైపాల్‌రెడ్డి తాళాలు వేసుకొని వెళ్లిపోయారు. దీంతో తనను పదవి నుంచి తప్పుకోవాలని ఎలాంటి నోటీసులు అందలేదని, నోటీసు అందే వరకూ నేనే చైర్మన్‌గా కొనసాగుతానంటూ చేగూరి స్పష్టం చేయగా.. కోర్టు ఉత్తర్వుల ప్రకారం నేనే చైర్మన్‌ను అంటూ జైపాల్ పట్టు బట్టారు. జరుగుతున్న పరిణామాలను అక్కడి సిబ్బంది జిల్లా ఉన్నతాధికారులకు చేరవేశారు. దీంతో చైర్మన్ పీఠంపై పీట ముడిని విప్పే బాధ్యత సహకార శాఖ అధికారులపై ఉంది.

ఖాతాదారులు వర్సెస్ సిబ్బంది

చైర్మన్ పీట ముసలంతో ఖాతాదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడి సిబ్బంది లావాదేవీల వ్యవహారంలో ఖాతాదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. డబ్బులు ఇవ్వకుండా కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారని పలువురు పేర్కొంటున్నారు. డబ్బులు లేవని ముప్పుతిప్పలు పెడుతున్నారని వాపోతున్నారు. పిల్లల వివాహాల కోసం, ప్లాట్ల కొనుగోలుకు డబ్బులు పొదుపుచేసుకుంటే.. అవసరాలకు ఇవ్వకపోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. కాగా సంఘానికి వాణిజ్య బ్యాంక్‌గా మొదటి నుంచి కొనసాగుతున్న సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖలో సంఘానికి ఉన్న బ్యాంక్ ఖాతాను మూడు నెలల క్రితమే సీజ్ చేసినట్లు సమాచారం. ఈ విషయం నేటికీ బహిర్గతం కాకపోవడం గమనార్హం.

వ్యయం తక్కువ.. ఆదాయం ఎక్కువ

- నానో యూరియాతో ప్రయోజనం
- ఏడీఏ శోభారాణి


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ శోభారాణి

మాడ్గుల: నానో యూరియా వాడటం వలన తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందవచ్చని ఆమనగల్లు డివిజన్ ఏడీఏ శోభారాణి అన్నారు. శుక్రవారం మండల పరిధి ఇర్విన్‌లో నానో వినియోగం గురించి రైతులకు అవగాహన కల్పించారు. ప్రయోజనాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నానో వినియోగంతో నైట్రోజన్ వినియోగ సామర్థ్యం పెంచుతుందని, మొక్కల ఎదుగుదలతో పాటు ఆశించిన మేర దిగుబడి వస్తుందని పేర్కొన్నారు. అనంతరం వ్యవసాయ అధికారులు ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. యూరియా స్టాక్ బోర్డు, ధరల పట్టికలను ప్రదర్శించాలని సూచించారు. రైతులకు రసీదు ఇవ్వాలని చెప్పారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతుల అవసరం మేరకు యూరియా అందుబాటులో ఉంచాలని, వారిని ఇబ్బందులకు గురిచేయరాదన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అరుణకుమారి, రైతులు పాల్గొన్నారు.

చవితిని ప్రశాంతంగా జరుపుకోవాలి

షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ


సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ

కడ్తాల్: నిబంధనలను పాటిస్తూ వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పీబీఆర్ కన్వెన్షన్ హాలులో సీఐ గంగాధర్ ఆధ్వర్యంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. మండప నిర్వాహకులు ఆన్‌లైన్ ద్వారా పోలీసు శాఖ అనుమతి పొందాలని, ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మండపాలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. డీజేలు పెట్టరాదని హెచ్చరించారు. మండపంలో 24 గంటల పాటు వలంటీర్ అందుబాటులో ఉండాలన్నారు. ఏమైనా సమస్యలు తలెత్తితే 100 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. ఎస్ఐలు వరప్రసాద్, చంద్రశేఖర్, శాంతికమిటీ సభ్యులు, మాజీ ప్రతినిధులు, నాయకులు తదితరులు ఉన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

ఇబ్రహీంపట్నం: శనివారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటనర్సప్ప శుక్రవారం తెలిపారు. డిపో పరిసర ప్రాంతాల్లోని ప్రజలు తమ సలహాలు, సూచనలు, సమస్యలను 99592 26141 నంబర్‌కు తెలపాలని కోరారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

పశువుల షెడ్ ప్రారంభం


కూలీలను సన్మానిస్తున్న ఎంపీడీఓ తదితరులు

ఇబ్రహీంపట్నం: పనుల జాతరలో భాగంగా శుక్రవారం మండల పరిధి ముకునూర్‌లో ఉపాధిహామీ నిధులతో నిర్మించుకున్న పశువుల షెడ్‌ను ఎంపీడీఓ ప్రారంభించారు. అనంతరం బాగా పనులు చేసిన కూలీలను సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. పశువుల షెడ్లు, పండ్ల తోటలు పెట్టుకోవాలని ఆనుకునే రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రాయపోల్ గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండల పరిధి 14 గ్రామాల్లో పనుల జాతర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏపీఓ తిరుపతాచారి, జీపీ కార్యదర్శి రాజ్‌కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్స్ లింగస్వామి, యాదగిరి, సాంకేతిక సహాయకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తుర్కయంజాల్: సబ్ స్టేషన్ పరిధి బోటెక్, నాదర్‌గుల్ ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం పలు చోట్ల విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నామని ఏఈ రవీందర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు బోటెక్ ఫీడర్ పరిధి వైకేఆర్, జయసూర్య పట్నం, సీబీ ఎన్‌క్లేవ్, సరస్వతి ఎన్‌క్లేవ్, సాగర్ ఎన్‌క్లేవ్, అంబేడ్కర్ నగర్, మారుతీనగర్, టెంపుల్ టౌన్, చిలుకూరి ఎన్‌క్లేవ్, రఘు హోమ్స్, శ్రీరామ ఎన్‌క్లేవ్, ఆదిబట్ల శివాలయం, నాదర్‌గుల్ గ్రామం, అయోధ్య నగర్, శాంతినగర్, ధరణి ఎన్‌క్లేవ్, గ్రీన్ హోమ్స్, బాలాజీ కాలనీ, నాదర్‌గుల్ ఫీడర్ పరిధి రాఘవేంద్ర హోమ్స్, ట్రెజరర్ ఎన్‌క్లేవ్, వైష్ణవి ఎన్‌క్లేవ్, పీఎంఆర్, కేఎంఆర్‌సీ వ్యవసాయ కనెక్షన్‌లకు సరఫరా నిలిపివేయనున్నామని తెలిపారు. అలాగే మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు పార్వతీపురం, గైరాన్‌కోట, ఎంఎన్ఆర్ హోమ్స్, ద్వారకాపురి, మత్రిగూడ, రాగన్నగూడ, కుర్మల్‌గూడ, ఎస్‌పీఆర్ హోమ్స్, ఇంద్రానగర్, జిన్నారం, ఆదిబట్ల మెయిన్‌రోడ్, ఆయుధాల గడ్డ, గ్రీన్ ఫీల్డ్ కాలనీతో పాటు వ్యవసాయ కనెక్షన్‌లకు సరఫరా నిలిచిపోనుందని ఏఈ పేర్కొన్నారు. ఈ అంతరాయానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి


బాధితులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు: కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. నియోజకవర్గ పరిధి ముర్తుజపల్లి గ్రామానికి చెందిన సుభద్రమ్మకు సీఎంఆర్‌ఎఫ్ కింద రూ.51 వేలు, చౌదర్‌పల్లికి చెందిన భగవాన్‌రెడ్డికి రూ.6 లక్షలు, ఎల్లికల్‌కు చెందిన మహేశ్‌కు రూ.20 వేలు, బాలమణికి రూ.36 వేలు, చరికొండకు వాసి లక్ష్మయ్యకు రూ.60 వేలు మంజూరు అయ్యాయి. ఈ మేరకు నగరంలోని తన నివాసంలో శుక్రవారం బాధితులకు ఆయన అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గోలి సురేందర్‌రెడ్డి, అనంతరెడ్డి, విజయ్, బీష్మాచారి, తావుర్యానాయక్, విజయ్‌రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

మన ప్రాంతం.. మన వ్యాపారం

- మార్వాడీలతో నష్టపోతున్న స్థానికులు
- వర్తక వ్యాపారుల ఆందోళన
- ఓయూ జేఏసీ పిలుపు మేరకు బంద్


కడ్తాల్: ర్యాలీ నిర్వహిస్తున్న వ్యాపారులు


ఆమనగల్లు: పట్టణంలో మూతపడిన దుకాణాలు

ఆమనగల్లు/ కడ్తాల్: మార్వాడీ దుకాణాల వలన ఇక్కడి వ్యాపారులు నష్టపోతున్నారని, స్థానికులకు ఉపాధి అవకాశాలు లేకుండా పోతున్నాయని వర్తక సంఘం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. మన ప్రాంతంలో మనమే వ్యాపారం చేసుకోవాలన్నారు. మార్వాడీలకు వ్యతిరేకంగా ఓయూ జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి నియోజకవర్గ పరిధి మండలాల్లో వర్తక, వ్యాపార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం దుకాణాలు మూసివేసి, స్వచ్ఛందంగా బంద్ నిర్వహించారు. 'గోబ్యాక్ మార్వాడీ,' 'మార్వాడీ వద్దు లోకల్ ముద్దు' 'మన ప్రాంతం మన వ్యాపారం' అంటూ ప్లకార్డులతో నిరసన తెలిపారు. కడ్తాల్ మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, వినతిపత్రం అందజేశారు. శ్రీశైలం– హైదరాబాద్ జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు ఆసిఫ్ అలీ, గౌరవ అధ్యక్షుడు వెంకటేశ్ మాట్లాడుతూ.. ఎక్కడి వారు అక్కడే ఉపాధి పొందాలని, మార్వాడీ గో బ్యాక్ అని డిమాండ్ చేశారు. ఆందోళనల నేపథ్యంలో పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకొని ఠాణాకు తరలించారు. కార్యక్రమంలో వెంకటేశ్, రాజేందర్ యాదవ్, చంద్రశేఖర్, శ్రీనాథ్, భూపాల్, కిరణ్, శ్రీనివాస్, రాఘవేందర్, వీరేందర్, యూసుఫ్, సైదులు తదితరులు ఉన్నారు.

ఆమనగల్లులో.. ప్రశాంతం

ఓయూ జేఏసీ రాష్ట్ర వ్యాప్త బంద్ పిలుపు మేరకు ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం వర్తక, వ్యాపార సంఘం ఆధ్వర్యంలో దుకాణాలు మూసివేసి నిరసన తెలిపారు. వారాంతపు సంత కావడంతో మధ్యాహ్నం షాపులను తెరిచారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ వెంకటేశ్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. మార్వాడీలకు వ్యతిరేకంగా వర్తకులు ర్యాలీ తీయాలని భావించినప్పటికీ.. పోలీసుల అనుమతి నిరాకరణతో నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నారు.

మార్వాడీ హటావో.. తెలంగాణ బచావో


ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: నార్త్ ఇండియా నుంచి ఇక్కడికి వచ్చిన మార్వాడీలు.. స్థానిక వర్తకుల వ్యాపారాలను దెబ్బతీస్తున్నారని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఇందిరాల రమేష్, బ్రాహ్మణ సంఘం నాయకుడు మడుపు వేణుగోపాల్‌రావులు ఆరోపించారు. మార్వాడీలకు వ్యతిరేకంగా శుక్రవారం ఇబ్రహీంపట్నంలో దుకాణాలను మూసివేసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మతాన్ని అడ్డం పెట్టుకొని, గోరక్షణ అంటూ వ్యాపారం చేస్తూ ఇక్కడి వారిని తీవ్ర నష్టాలకు గురిచేస్తున్నారని విమర్శించారు. మార్వాడీలు తమ దుఖాణాల్లో అక్కడి వారికి ఉపాధి కల్పిస్తూ, నాసిరకం సామగ్రిని విక్రయిస్తూ మోసం చేస్తున్నారన్నారు. ఆలయాల్లో సైతం అక్కడి వారిని తీసుకువచ్చి పూజలు చేయిస్తున్నారని మండిపడ్డారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు నివాళులర్పించారు. పట్టణంలోని ప్రధాన విధుల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. మార్వాడీ హటావో.. తెలంగాణకు బచావో అని నినదించారు. వర్తక సంఘం అధ్యక్షుడు మిర్యాణం కిరణప్ప, మొబైల్ షాపుల సంఘం నాయకులు సాగర్, యాదగిరి, నాయకులు రఘుపతి, భర్తకి జగన్, యాదగిరి, బండి మహేశ్, అబేద్, షబ్బీర్, విశ్వకర్మ సంఘం నాయకులు శ్రీనివాస్, విక్రమ్‌చారి, వీరాచారి, హాస్టల్ అసోసియేషన్ నాయకులు శ్రీనివాస్, రవి, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాండుగుప్తా పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- మండల ప్రత్యేకాధికారి మాధవరావు
- పల్లెల్లో ఘనంగా పనుల జాతర
- పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం


కడ్తాల్: హార్వెస్టింగ్ సిస్టమ్ పనులను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ సుజాత


యాచారం: చౌదర్‌పల్లిలో జాతరను ప్రారంభిస్తున్న అధికారులు

యాచారం: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని మండల ప్రత్యేకాధికారి మాధవరావు అన్నారు. అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయని, అర్హులు వాటిని సద్వినియోగం చేసుకొని, ఆర్థిక ప్రగతి సాధించాలని సూచించారు. మండల పరిధి యాచారం, చౌదర్‌పల్లి గ్రామాల్లో శుక్రవారం పనుల జాతర ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా చౌదర్‌పల్లిలో ఆదర్శ రైతు కాశమల్ల రాములు వ్యవసాయ క్షేత్రంలో ఈజీఎస్ పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాధారాణి, ఈజీఎస్ ఏపీఓ లింగయ్య, ఈసీ శివశంకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

హార్వెస్టింగ్ సిస్టమ్ పనులకు పూజ

కడ్తాల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రం, పరిధి గ్రామాల్లో పల్లెపల్లెనా పనుల జాతర– 2025ను ప్రారంభించారు. ఇందులో భాగంగా గ్రామసభలు నిర్వహించారు. మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రంలో రూఫ్‌టాప్ రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ సిస్టమ్ పనులకు ఎంపీడీఓ సుజాత భూమి పూజ చేసి ప్రారంభించారు. చరికొండ పల్లెచెలక తండాల్లో ఇందిరమ్మ ఇళ్లు, ఇంకుడు గుంతల నిర్మాణ పనులకు మైనర్ ఇరిగేషన్ ఏఈ మహేందర్‌రెడ్డి ప్రారంభించారు. ముద్విన్ అభివృద్ధి కార్యక్రమాల్లో తహసీల్దార్ ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు. మైసిగండిలో ఇంకుడు గుంతల నిర్మాణ పనులను అధికారులు, స్థానిక నాయకులతో కలిసి పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. జీపీ కార్యదర్శి జంగయ్య, మాజీ సర్పంచ్ తులసీరాం నాయక్, నాయకులు హీరాసింగ్, రాందాస్, తులసీరాం, వినోద్, చందు, సుధీర్ తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

కళాశాల భవనం పూర్తిచేయండి

ఆమనగల్లు: పట్టణంలో అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులను పూర్తిచేసి, వెంటనే తరగతులను ప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కళాశాల ఎదుట రెండు రోజుల రిలే నిరాహార దీక్షలను శుక్రవారం ప్రారంభించారు. నిర్మాణ పనులు ప్రారంభించనప్పటికీ.. భూ వివాదం కారణంగా పనులు నిలిపివేశారని, నిర్మాణం పూర్తిచేసి వినియోగంలోకి తేవాలని కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రణయ్, జిల్లా కార్యదర్శి శంకర్, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీకాంత్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు

తుర్కయంజాల్: నిబంధనలు పాటించని దుకాణదారులపై కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ కె.అమరేందర్ రెడ్డి హెచ్చరించారు. కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం తుర్కయంజాల్, కమ్మగూడలోని పలు హోటళ్లు, బేకరీలపై శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వనిత దాడులు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పలు దుకాణాల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొందన్నారు. మన స్వాగత్ టిఫిన్ సెంటర్ నిర్వాహకులకు రూ.2 వేలు జరిమానా విధించామని తెలిపారు. అదేవిధంగా మాసబ్ చెరువు కట్టపైన తాగి పడేసిన కొబ్బరి బోండాలను అలానే వదిలేసినందుకు సదరు వ్యాపారికి రూ.500 ఫైన్ వేశామని పేర్కొన్నారు.

గ్రామీణాభివద్దే లక్ష్యం

మాడ్గుల: గ్రామీణాభివద్ధి, ప్రజలకు ఉపాధి కల్పన, పల్లెల్లో మౌలిక సదుపాయాల విస్తరణ కోసం ప్రభుత్వం పనుల జాతర ప్రారంభించిందని సింగిల్ విండో డైరెక్టర్ జగన్ గౌడ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని అందుగుల గ్రామంలో పల్లెపనుల జాతరలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రం పనులు ప్రారంభించారు.

ఆర్థిక సహాయం

ఇబ్రహీంపట్నం: స్నేహితురాలి కుటుంబానికి బాల్యమిత్రులు అండగా నిలిచారు. మండల పరిధి రాయపోల్ గ్రామానికి చెందిన స్వప్నకు.. మంచాల మండల కేంద్రానికి చెందిన కానిస్టేబుల్ వెంకటేశ్‌తో పదేళ్ల క్రితం వివాహం అయింది. ఆమె భర్త ఇటీవల అకాల మరణం పొందాడు. దీంతో స్వప్నతో రాయపోల్ ప్రభుత్వ పాఠశాల 2006– 2007 పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు రూ.63 వేలను శుక్రవారం ఆర్థిక సహాయంగా అందజేశారు.

బీజేపీ నాయకుల అరెస్టు

ఆమనగల్లు: బీజేపీ ఆధ్వర్యంలో సేవ్ హైదరాబాద్ చలో అసెంబ్లీ ముట్టడి పిలుపు నేపథ్యంలో.. ఆ పార్టీకి చెందిన పలువురు పట్టణ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. శుక్రవారం ఉదయం అదుపులోకి తీసుకొని సాయంత్రం వదిలిపెట్టారు. పోలీసులు అదుపులోకి తీసుకున్నవారిలో లక్ష్మణ్, నర్సింహ, చెన్నకేశవులు తదితరులు ఉన్నారు.